పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024 – 25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో డే స్కాలర్‌లో ప్రవేశానికి ఎస్సీ కోటాలో జిల్లాకు ఒక సీటు కేటాయించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 27 నుంచి మార్చి 12వరకు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, 2017 జూన్ 1 – 2018 మే 31 మధ్యలో జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు వెంట జనన, కుల, వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. మార్చి 15న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలకు, మరిన్ని వివరాలకు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయం రూమ్ నెంబర్ ఎస్–17లో సంప్రదించాలని సూచించారు.

కృష్ణ పట్టెలో కరువు తాండవం

అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంట పొలాలు

సాగర్‌నీటిని విడుదల చేయక పోవడంతో గడ్డు పరిస్థితులు | పెట్టిన పెట్టుబడులు కూడా రావేమోనని రైతుల ఆందోళన | కొత్తగా బోర్లు వేసి పంటలను కాపాడే ప్రయత్నం

అడుగంటిన చిల్లేపల్లి చెరువు

నేరేడుచర్ల మండలం సోమారంలో నీళ్లు లేక చివరి దశలో ఎండిపోతున్న వరి పంట

నీళ్లకోసం నేరేడుచర్లలో వేస్తున్న బోరు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 24 : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల పరిస్థితి. పక్కనే కృష్ణమ్మ ఉన్నప్పటికీ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కాక అన్నదాతలు గోస పడుతున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతమైన హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటి కరువు తాండవించే పరిస్థితులు నెలకొన్నాయి. ఎడమ కాల్వకు నీటి విడుదల చేయకపోవడం, వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువులు జలకళతో ఉట్టిపడగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండిపోతున్నాయి.

90,250 ఎకరాలకు తగ్గిన సాగు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గత సంవత్సరం యాసంగిలో 1,36,800 ఎకరాల్లో వరి సాగు చేయగా. ఈ సీజన్‌లో 90,250 ఎకరాలకు పడిపోయింది. సాగర్ ఆయకట్టు కింద ప్రభుత్వం పంటలు వేసుకోవద్దని సూచించింది. కానీ సాగర్‌ను నమ్ముకొని సాగు చేసిన వారికి ఎప్పుడూ నష్టం రాలేదని రైతుల నమ్మకం. అదే విశ్వాసంతో నాట్లు వేశారు. సాగర్ నీటిని చివరి దశలోనైనా విడుదల చేస్తారని ధైర్యంగా ముందుకు సాగారు. కొంత మంది రైతులు, బోర్లు, బావుల ద్వారా కూడా సాగు చేస్తున్నారు. గతంలో కేసీఆర్ సర్కార్ సాగర్ డ్యామ్‌లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీలో 505 అడుగులు ఉన్నప్పటికీ తడుల విధానంగానైనా నీటిని విడుదల చేసి రైతులకు అండగా నిలిచింది. ప్రస్తుతం 520 అడుగులు సాగర్‌లో నీరు ఉన్నప్పటికీ నీటిని విడుదల చేయడం లేదు. తీవ్రమైన ఎండలు రావడంతో ఫిబ్రవరి మొదటి వారంలోనే భూగర్భ జలాలు గరిష్ఠ స్థాయిలో అడుగంటి పోయాయి. దాంతో వరి పంటలు పూర్తిగా ఎండిపోయి అన్నదాతకు తీరని నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది.

ఎకరానికి 35 వేల పెట్టుబడి

వరి సాగు కోసం రైతులు ఎకరానికి సుమారు రూ. 30వేల నుచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి పోగా ఆరుగాలం కష్టపడ్డ శ్రమ వృథా అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు మూడు ఎకరాల సాగుచేసిన రైతులకు ఒక్క ఎకరాకు కూడా సక్రమంగా నీరదండం లేదని వాపోతున్నారు. ఈ సమయంలో సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే కొద్దిపాటి పంట అయినా చేతికొస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలోచించి సాగర్ నీటిని పాలేరు రిజర్వాయర్‌కు విడుదల చేసిన విధంగానే జాన్ పహాడ్ మేజర్‌కు కూడా విడుదల చేయాలని కోరుతున్నారు.

భగీరథ ప్రయత్నం

సాగర్ నీరు రాకపోవడంతో పొలాలను రక్షించుకోవడం కోసం రైతులు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఈ యాసంగిలో సీజన్‌లోనే సుమారు 1500 నుంచి 1800 బోర్లు వేసినట్లు సమాచారం. లక్ష రూపాయలు ఖర్చు చేసి సుమారు ఒక్కొక్క బోరు 200 ఫీట్లకు పైగా వేసినప్పటికీ సరపడా నీరు పోయడం లేదు. దాంతో సాగు చేసిన వరి పంట ఎండే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

ఈ ఏడాది వర్షాలు లేక పోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. సాగర్ నుంచి నీటి విడుదల కూడా లేకపోవడంతో పరిస్థితి ఘోరంగా ఉన్నది. నాకున్న కొద్ది పొలం మొత్తం నీళ్లు లేక ఎండిపోయింది. ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేస్తే పంటలకు చేతికొస్తాయి.

– పెద్దపంగ సామేలు, రైతు, సోమారం, నేరేడుచర్ల మండలం

ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి

నాకున్న మూడు ఎకరాలలో బోర్లు, బావులను నమ్ముకొని వరి సాగు చేస్తే పూర్తిగా ఎండిపోయింది. గతంలో ఇట్ల లేకుంటే. గత ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు ఇచ్చింది. ఎండిపోయిన పంటలను సర్వే చేయించి ప్రభుత్వం నష్టం పరిహారం చెల్లించాలి. లేకుంటే అప్పులే మిగులుతాయి.

– కె.రాంరెడ్డి, రైతు, కొండాయిగూడెం, గరిడేపల్లి మండలం

పాతగుట్టలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాతగుట్టలో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

- వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం
- 108 కలశాలతో ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 : వారంరోజులుగా కొనసాగుతున్న పాత గుట్ట బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిపూర్ణమయ్యాయి. లక్ష్మీనరసింహస్వామికి ఆగమశాస్త్రానుసారంగా వేదమంత్ర పఠనాలతో అష్టోత్తర శతఘటాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో 108 కలశాల్లో పంచామృతాలు, పవిత్ర తీర్థ జలాలు, సుగంధ ఫలరసాలు, నారికేళ జలాలను అభిమంత్రించి పవిత్ర ద్రవ్యాలతో, తీర్థరాజములతో కల్యాణోత్సవ మూర్తులను, మూలవరులను అభిషేకించారు. జీవనదుల నుంచి తెప్పించిన జలాలతో సుమారు నాలుగు గంటల పాటు శ్రీవారికి అభిషేకం చేశారు. పంచభూతాల్లోని పృథ్వీజలాలు, వాయువు, తేజస్సుతత్వాలు ప్రకృతి నిండా ఆవరించిన ఫలభరిత మధుర రసాల సృష్టికి కారణభూతమైన 96 తత్వాలు(తిథి, వార, నక్షత్ర) పక్ష, మాస, సంవత్సర స్వరూపాలు, ద్వాదశాదిత్యులు తదితర 108 కలశాలతో పూజలు జరిపారు. కలశతీర్థం, పుణ్యజలానికి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. ప్రధాన కలశంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కలశ తీర్థం పుణ్యజలాన్ని కలిపి శ్రీవారికి అభిషేకం చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ఉత్సవ కైంకర్యాన్ని ఆలయ ఉప ప్రధానార్చకులు జరిపారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న పారాయణీలను సన్మానించారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు మహదాశీర్వచనం జేసి బ్రహ్మోత్సవాలకు పరిపూర్ణం పలికారు. ఈ వేడుకల్లో ఆలయ ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌ధీఘళ్ సీతామనోహరాచార్యులు, పారాయణందారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీకాంత్, విజయకుమార్ పాల్గొన్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న ఎంపీ రవిచంద్ర


కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న ఆయన స్వయంభూ పంచనారసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి తదితరులు

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నందికొండ, ఫిబ్రవరి 25 : గిరిజనులకు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవమని, ఆయన ఆచరణలను పాటించాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంగ్ ఆధ్వర్యంలో నందికొండ హిల్‌కాలనీలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలకు ఆయనతోపాటు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వారు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి, బోగ్ భండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఉద్ధరణ కోసం సంత్ సేవాలాల్ చేసిన కృషి ఎనలేనిదని, ఆయన చూపిన బాటలో గిరిజనులు ఐక్యతతో నడువాలన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సీనియర్ నాయకులు శంకర్‌నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్తావత్ రామచంద్రనాయక్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బాబూరావునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భగవాన్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, రవినాయక్, సైలాబ్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, జడ్పీటీసీ భారతిభాస్కర్‌నాయక్, ఎంపీపీ పాండమ్మశ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కేశం అజ్మీర్, నాయకులు సక్రూనాయక్, చందులాల్‌నాయక్, మున్నినాయక్, కౌన్సిలర్లు మంగ్తానాయక్, మోహన్‌నాయక్, రమేశ్‌జీ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. భూదాన్ పోచంపల్లిలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల పక్షాన నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణ రాష్ట్ర అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అర్హత ఉన్నవారందరికీ 200 యూనిట్ల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతక లింగస్వామి, నాయకులు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల శ్రీశైలంగౌడ్, చిట్టిపోలు శ్రీనివాస్, చిల్లర జంగయ్య, కర్ణాటి రవీందర్, గునిగంటి మల్లేశంగౌడ్, ముత్యాల మహిపాల్‌రెడ్డి, ఆర్ల లింగస్వామి, రావుల యాదగిరి, నోముల ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


తిప్పర్తి గ్రామ పంచాయతి రేషన్ షాపు 18 జరిగిన పరీక్షలలో వచ్చిన మార్కులు

క్రమ సంఖ్య	అభ్యర్థి పేరు	విద్యార్హత	పరీక్షలో వచ్చిన మార్కులు80	ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులు 20	మొత్తం మార్కులు
1.	కిన్నెర వేణు కుమార్	M.A, Be.d	69	00	69
2.	కిన్నెర నాగలక్ష్మి	M.com	66	00	66
3.	ఊదరి శ్రీకాంత్	PG	58	00	58
4.	పాక ఏలియాజర్	Inter	52	19	71
5.	ఆదిమల్ల సురేష్	SSC	51	20	71

తిప్పర్తి రేషన్ డీలర్ కోసం నిర్వహించిన పరీక్ష, ఇంటర్వ్యూలో మార్కులు పొందిన వారి వివరాలు

రేషన్ డీలర్ల నియామకాల్లో అక్రమాలు

- పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చినా ఇంటర్వ్యూలో జీరో
- కాంగ్రెస్ వర్గాలను ఎంపిక చేశారని పలువురు ఆరోపణ

నల్లగొండ, ఫిబ్రవరి 25 : నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో ఖాళీ అయిన రేషన్ డీలర్ల భర్తీ కోసం ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా అర్హుల ఎంపికలో అక్రమాలు జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అర్హత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చినా ఇంటర్వ్యూలో జీరో మార్కులు వేసి అనర్హులను ఎంపిక చేసినట్లు తెలుపుతున్నారు. డిగ్రీ, పీజీ చదివిన వారి కంటే పదో తరగతి చదివిన వారికి, కాంగ్రెస్ పార్టీ అనుచరులనే ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. దీనిపై పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఇంటర్వ్యూలో గోల్‌మాల్

నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 20 గ్రామాల్లో రేషన్ డీలర్ల నియామకాలకు ప్రభుత్వ సూచన మేరకు అధికారులు గతేడాది డిసెంబర్ 31న పదో తరగతి అర్హతగా నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 12న 80 మార్కులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ నెల 12న మరో 20 మార్కులకు ఇంటర్వ్యూ చేపట్టిన అధికారులు ఈ రెండింటిని ఆధారంగా చేసుకొని ఈ నెల 13న ఎంపికైన వారి జాబితాను ప్రకటించారు. తుది దశగా నిర్వహించిన ఇంటర్వ్యూలో పీజీలు, డిగ్రీలు చదివి అత్యధిక మార్కులు పొందిన వారికి జీరోలు వేసి, పదో తరగతి చదివి అత్యల్ప మార్కులు పొందిన వారికి 20కి 20 మార్కులు వేశారు. దాంతో రేషన్ డీలర్ల పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఇంటర్వ్యూలో నిరాశ ఎదురైంది.

పరీక్షల్లో మాకు ఎక్కువ మార్కులు వచ్చినా ఇంటర్వ్యూల్లో జీరోలేంది

తిప్పర్తిలో రేషన్ డీలర్ పోస్టు ఖాళీ అయిందని నోటిఫికేషన్ చూసి దరఖాస్తు చేసుకున్నాం. పరీక్ష రాస్తే ఎంఏ బీఈడీ చేసిన నాకు 80 మార్కులకు 69, ఎంకాం చేసిన నా భార్యకు 66 మార్కులు వచ్చాయి. మా ఇద్దరికి ఇంటర్వ్యూలో జీరోలు వేసి పదో తరగతి చదివి డీలర్ పరీక్షలో 80కి 51 మార్కులు వచ్చిన ఆదిమూలం సురేశ్‌ను ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలో 20కి 20 మార్కులు వేసి మా కంటే రెండు మార్కులు ఎక్కువ ఉండేలా వేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కావడం వల్లనే అర్హులైన మాకు రాలేదు.

–కిన్నెర వేణు, నాగలక్ష్మి దంపతులు, తిప్పర్తి

డిగ్రీలు వదిలేసి పదో తరగతి వారిని ఎంపిక చేసుడేంది

నేను డిగ్రీ చదువుకున్నా. మా ఊరిలో ఖాళీ అయిన రేషన్ డీలర్ కోసం దరఖాస్తు చేసుకున్నా. పరీక్ష రాస్తే నాకు 80 మార్కులకు 54 వచ్చాయి. కానీ పదో తరగతి చదివి 49 మార్కులు వచ్చిన నూనె పద్మను ఎంపిక చేశారు. గ్రాడ్యుయేట్ చేసిన నాకు ఇంటర్వ్యూలో ఒక్క మార్కు కూడా రాక పోవడం ఏంది. నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది ఇదేనా. అలాంటప్పుడు నోటిఫికేషన్ ఎందుకు. కాంగ్రెస్ కార్యకర్తలకే రేషన్ డీలర్ ఇస్తే సరిపోతుంది కదా.

– చలకాని ఊర్మిళ, అంబారి పేట, శాలిగౌరారం మండలం

ఇంటర్వ్యూలే ప్రధానం

నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో రేషన్ డీలర్ల నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసి రాత పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా అర్హులను ఎంపిక చేశాం. కొందరు పీజీలు, డిగ్రీలు చేసినా ఇంటర్వ్యూలో సమాధానాలు చెప్పలేదు. మరి కొందరు పదో తరగతి చదివినప్పటికీ ఇంటర్వ్యూలో మంచి సమాధానం చెప్పినందువల్లనే ఎంపిక చేశాం. చదువు ప్రాధాన్యత కాదు చెప్పే సమాధానమే ముఖ్యం.

– రవి, ఆర్డీఓ, నల్లగొండ

అమృత్ భారత్ స్టేషన్లుగా నల్లగొండ, మిర్యాలగూడ

- నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 25 : అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వం నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. ఈ పథకం కింద పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నది. ఇందుకోసం ఒక్కో స్టేషన్‌కు రూ.9.50 కోట్ల చొప్పున కేటాయించింది. దానికి సంబంధించిన పనులను సోమవారం ప్రధాన మంత్రి మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దానిలో భాగంగా జిల్లా పరిధిలోని నార్కట్‌పల్లి, కేశరాజుపల్లి, బుద్ధారం వద్ద నిర్మించిన అండర్ పాస్‌లను జాతికి అంకితం చేయనున్నారు.

జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

513 మందికి నియామక పత్రాలు

నకిరేకల్, ఫిబ్రవరి 25 : నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మేళాను ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి పేద విద్యార్థికి అండగా ఉండటమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో 2,282 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా మొదటి రోజు 513 మందికి నియామక పత్రాలు అందజేశామని, మరో 800కు పైగా అభ్యర్థులకు జాబ్ ఆర్డర్స్ పంపించనున్నామని కంపెనీల ప్రతినిధులు చెప్పారు.

కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, టీపీసీసీ మ్యానిఫేస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు, కౌన్సిలర్లు గాజుల సుకన్య, గడ్డం స్వామి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, యానాల లింగారెడ్డి, కంపెనీల ప్రతినిధులు, కన్సల్టెన్సీ మన్మోహన్, సత్య పాల్గొన్నారు.

చీదెళ్లలో ప్రభబండ్ల ప్రదర్శన

కనుల పండువగా ప్రభ బండ్ల ఊరేగింపు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 25 : మండల పరిధి చీదెళ్లలోని లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభ బండ్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు ఇంటికో ప్రభ బండిని అలంకరించి బ్యాండు మేళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమం గ్రామానికి ప్రత్యేక ఆకర్షణ నిలువగా, బంధువులు రాకతో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం భక్త జనుల నడుమ ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట రెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్ రాజీవ్‌గాంధీ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి గణపతి పూజ, కుంకుమార్చన, మహా నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, ప్రసాద వితరణ కార్యక్రమాలను వేద పండితులు ఉదయభాస్కర శర్మ, గోపయ్యనిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

నేటి జాబ్ మేళాకు ఏర్పాట్లు పరిశీలన

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 25: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించనున్న జాబ్ మేళాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎంజీయూ వైస్ చాన్సలర్ గోపాల్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ గోనారెడ్డితో కలిసి ఆదివారం ఎంజీ యూనివర్సిటీలో జాబ్ మేళా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వర్ రావు, జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఎంజీయూ రిజిస్ట్రార్ ఆల్వాల రవి, వై.ప్రశాంతి, టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.